## 0.1 రాజా పరీక్షిత్ - కథా సారాంశము

పరీక్షిత్తు అర్జునుని మనుమడు.మహాభారత యుద్ధము సమాప్తమైన కొంతకాలానికి తాతగారైన ధర్మరాజా పాలన అనంతరం హస్తినాపురమును ధర్మబద్ధుడై పరిపాలించెను. అంత ధర్మబద్ధుడైనా, ఆయనలో కలి ప్రవేశించి ఒక చిన్న తప్పిదమునకు కారణమగును. ఒకనాడు అడవిలో వేటాడుతూ దప్పికగొని తపస్సు చేసుకొనుచున్న ఒక ముని ని నీరిమ్మని కోరెను. బదులు లేకపోగా కోపముతో ఒక చచ్చిన పామును ఆముని మెడలో విసరి వెళ్ళిపోయెను. ఆముని కుమారుడు అది తెలిసికొని, ఏడు దినములలో ఆరాజుకు మరణము సంభవించునని శపించును. ఆ విషయమును తెలిసికొనిన పరీక్షిత్తు రాజ్యమును విడచి, అన్నపానములు వదలి శుకమహర్షి ద్వారా భాగవతమును విని మోక్షమును పొందెను. నారదుని బోధనలవలన ఈ భాగవతమును వ్యాసభగవానుడు రచించెను. ఈ కావ్యమును తెలుగున బమ్మెర పోతన గారు అనువదించెను.

## 0.2 పాత్రలు - పాత్రధారులు

| | | | | |
|---|---|---|---|---|
| భాగము-1, పాత్రలు: 3 | - పోతన | - పోతన గారి శిష్యుడు-1 | - పోతన గారి శిష్యుడు-2 | |
| భాగము-2, పాత్రలు: 4+ | - నారదుడు | - వ్యాసుడు - పూజారి-1 | - పూజారి-2 | కొందరు భక్తులు |
| భాగము-3, పాత్రలు: 11 (+ ఒక ముని) | - పరీక్షిత్తు (ప) - మంత్రి | | - నర్తకి | - కలి పురుషుడు |
| | - *జనమేజయుడు (జ)* | | - *శుక మహర్షి (శు)* | - *శమీకుడు (శ)* |
| | - *శృంగి (శృం)* - గౌరుడు *(గౌ)* | | - భటుడు - 1 | - భటుడు - 2 |

*(ప)హస్తినాపురమునకు రాజా, అర్జునుని మనుమడు; (జ) పరీక్షిత్తు కుమారుడు; (శు) భాగవతమును పరీక్షిత్తునకు బోధించిన బాలకుడు, వ్యాసుని కుమారుడు; (శ) అడవిలోని ఒక కుటీరములో తపస్సు చేసికొను ముని; (శృం) శమీకుని కుమారుడు, పరీక్షిత్తును శపించినవాడు; (గౌ) శృంగి స్నేహితుడు, పరీక్షిత్తునకు శాపమును తెలియజేసినవాడు.*

## 0.3 వేదిక అలంకరణ

- రాజ మందిరము: రాజుగారి సింహాసనము *[మెరిసిపోవునట్లు]*, మంత్రికి ఒక ఆసనము, కొన్ని పండ్ల పళ్ళెములు, పూల మాలలు, బంగారపు రంగు వస్తువులు, ఒక సింహపు బొమ్మ
- అడవి ప్రాంతము: శమీకుడు తపస్సు చేసికొను తిన్నె, కమండలము, ఒక చెట్టు, కొన్ని తులసి చెట్లు, పూల చెట్లు.
- శుకమహర్షి బోధనా ప్రాంతము: కొన్ని చెట్లు, శుకమహర్షి కూర్చొనుటకు ఒక తిన్నె.
- పాము: చచ్చిన పాము శరీరము వలె ఒక వస్తువు.
- ఒక పొడవాటి కర్ర వేదికమీద *[శృంగి పామును తన తండ్రి మెడ నుంచి తొలగించుటకు]*.

## 0.4 పాత్రల దుస్తులు, అలంకరణ

పోతన: తాటియాకుల గ్రంథము, ఘంటము
పోతన, శిష్యులు, నారదుడు, వ్యాసుడు, పూజారులు: ధోతీలు, అంగవస్త్రములు
వ్యాసుడు: తెల్ల గడ్డము
నారదుడు: కొప్పు, మహతి వీణ
పరీక్షిత్తు: రాజ మీసము, కిరీటము, విల్లు, బాణము, ఖడ్గము, మెరిసే అంగవస్త్రము, మెరిసే ధోతి.
జనమేజయుడు: యువరాజా దుస్తులు
మంత్రి: ధోతి, అంగవస్త్రము
కలి పురుషుడు: పూర్తిగా ఎర్రని దుస్తులు, చేతిలో కర్ర
శుకుడు: బాలకుడు, అంగవస్త్రము, కొద్దిపాటి ధోతి - ఒంటికి బూడిద రంగు.
శమీకుడు: పొడవాటి గడ్డము, కొప్పు, ధోతి, రుద్రాక్షలు, కమండలము
శృంగి, గౌరుడు: బాలకులు - ధోతి, అంగవస్త్రము, వ్రేళ్ళాడుచున్న జుట్టు
భటులు: అంగవస్త్రము, ధోతి, తల కండువలు
నర్తకి: భరతనాట్యం దుస్తులు

ఇతరములు:
ఘట్టము 2.2 లో
- ఒక శఠగోపము,
- రెండు ద్వారములు,
- రెండు నినాదములు:
"కోరికలు గలవారు"
"కోరికలు లేనివారు"

## 1.1 పోతన - గంగానదీ తీరము

**పోతన:** *[ఈ క్రింది పద్యమును పాడుచూ వేదికపై నడచుచుండును]*
చేతులారంగ శివునిఁ బూజింపడేని
నోరు నొవ్వంగ హరికీర్తి నుడువఁడేని
దయయు సత్యంబు లోనుగాఁ దలఁపడేని
గలుగనేటికిఁ దల్లుల కడుపుఁ జేటు. *(పోతన భాగవతము 1.14)*

**పోతన:** నాపూర్వజన్మ సహస్ర సంచిత తపఃఫలంబున శ్రీమన్నారాయణుని పుణ్య కథలను వ్రాయవలెనని కుతూహలముగానున్నది. ఇది పున్నమిరాత్రి. సజ్జన సమ్మతమున పొంగిపొరలే ఈ గంగాస్నానము చేసితిని, ఇక ఆ మహేశ్వర ధ్యానము చేసెదను.

**పోతన:** *[కూర్చుని ధ్యానము చేసికొనుచుండును. కొంచెం సేపాగి కనులు తెరచి]*
అహా సాక్షాత్తు ఆ శ్రీరామచంద్రుడు నా కన్నుగవకు కనిపించుచుండెనుకదా.

మెఱుఁగు చెంగట నున్న మేఘంబు కైవడి నువిద చెంగట నుండ నొప్పువాఁడు
చంద్రమండల సుధాసారంబు పోలిక ముఖమునఁ జిఱునవ్వు మొలచువాఁడు
వల్లీయుత తమాల వసుమతీజము భంగి బలువిల్లు మూఁపునఁ బరఁగువాఁడు
నీల నగాగ్ర సన్నిహిత భానుని భంగి ఘన కిరీటము దలఁ గలుగువాఁడు.

పుండరీకయుగముఁ బోలు కన్నులవాఁడు
వెడఁద యురమువాఁడు, విపులభద్ర
మూర్తివాఁడు రాజముఖ్యుఁడొక్కరుఁడు నా
కన్నుఁగవకు నెదురఁ గానఁబడియె. *(1.16)*

**పోతన:** శ్రీరామా! ఏమందువు? నా భవబంధములు తెగుటకు శ్రీమహాభాగవతమును తెనుగు సెయమందువా? నీ ఆనతి.

పలికెడిది భాగవతమట!
పలికించెడి వాడు రామభద్రుండట! నేఁ
బలికిన భవహరమగునట!
పలికెద వేఱొండుగాథఁ బలుకఁగ నేలా? *(1.18)*

భాగవతము దెలిసి పలుకుట చిత్రంబు!
శూలికైనఁ దమ్మిచూలికైన!
విబుధ జనులవలన విన్నంత కన్నంత
తెలియ వచ్చినంత తేటపఱుతు. *(1.19)*

[కొందఱకుఁ దెనుగు గుణమగుఁ....; ఒనరన్ నన్నయ తిక్కనాది కవులీయుర్విం...; లలిత స్కంధము, కృష్ణమూలము...]

**పోతన:** *[తాటియాకులపై భాగవతమును కొంచెంసేపు వ్రాయుచుండును.]*
*[ఇద్దరు శిష్యులు వచ్చెదరు.]*

**శిష్యుడు-1:** *నమస్కారం గురువర్యా!*

**శిష్యుడు-2:** *నమస్కారం గురువర్యా!*

**పోతన:** *నమస్కారం నాయనలారా!*

### 1.2 పోతన గారి శిష్యులు భాగవత పద్యములను అభినందించుట

**పోతన:** శిష్యులారా, నేను కొంచెం సేపు దేవాలయమునకు వెళ్ళి వచ్చెదను.
ఈ భాగవతానువాదమునగల కొన్ని పద్యములను చదువుకొనుము.
*[పోతనగారు వెడలి పోవును.]*

**శిష్యుడు-1**: అలాగే గురువర్యా!
**శిష్యుడు-2:** అలాగే గురువర్యా!

**శిష్యుడు-1**: సింగనా! ఇట్టి భక్తి కావ్యము నభూతో నభవిష్యతి. ఇందలి కొన్ని పద్యములను చదివెదమా?

**శిష్యుడు-2:** అలాగే! ఇందులో మానవునికి కావలసిన తత్త్వజ్ఞానమంతయు గలదు. ఇది సకల పురాణ రాజము. వేదేతిహాసముల సారమెల్లయు దాగియున్నది.

**శిష్యుడు-1:** అంతే కాదు, ఇందులో ప్రహ్లాద చరిత్రము, గజేంద్ర మోక్షము వంటి గొప్ప కథలు కూడా ఉన్నాయి.

**శిష్యుడు-2:** ప్రహ్లాద చరిత్రమున గల ఈ పద్యమును వినుము:

కమలాక్షునర్చించు కరములు కరములు శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ
సురరక్షకునిఁ జూచుచూడ్కులు చూడ్కులు శేషశాయికి మ్రొక్కు శిరము శిరము
విష్ణు నాకర్ణించు వీనులు వీనులు మధువైరిఁ దవిలిన మనము మనము
భగవంతు వలగొను పదములు పదములు పురుషోత్తముని మీఁది బుద్ధి బుద్ధి

దేవదేవునిఁ జింతించు దినము దినము
చక్రహస్తునిఁ బ్రకటించు చదువు చదువు
కుంభినీధవుఁ జెప్పెడి గురుఁడు గురుఁడు
తండ్రి హరిఁ జేరుమనియెడి తండ్రి తండ్రి. *(7.169)*

**శిష్యుడు-1:**

ఇందుగలడందు లేడని
సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి చూచిన
నందందే కలడు దానవాగ్రణి వింటే! *(7.275)*

**శిష్యుడు-2:** గజేంద్రమోక్షమున ఏనుగుకు మొసలి కి జరిగే పోరాటమును వినుము:

కరి దిగుచు మకరి సరసికి
గరి దరికిని మకరి దిగుచు గర కరి బెరయన్
గరికి మకరి మకరికి గరి
భరమనుచును నతల కుతల భటులరుదుపడన్. *(8.54)*

**శిష్యుడు-1:** వామన చరిత్రనుండి ఈ మధురమైన పద్యమును చూడుము:

ఇంతింతై, వటుడింతయై, మఱియుఁదానింతై, నభోవీథిపై
నంతై, తోయదమండలాగ్రమునకల్లంతై, ప్రభారాశిపై
నంతై, చంద్రుని కంతయై, ధ్రువుని పైనంతై, మహర్వాటిపై
నంతై, సత్యపదోన్నతుండగుచు బ్రహ్మాండాంతసంవర్ధియై. *(8.622)*

**శిష్యుడు-1:** ఈ భాగవతాన్ని గురువుగారు శ్రీరామచంద్రునికే అంకితమిచ్చారు తెలుసా!
**శిష్యుడు-2:** మరి నారదులు వ్యాసభగవానునికి చెప్పిన రహస్యాలన్నీ దీనిలో ఉన్నాయి. అంతటి మహా గ్రంథాన్ని, అంతటి పవిత్ర గ్రంథాన్ని మనుజేశ్వరాధములకివ్వజాలనని గురువుగారు చెప్పారు.

*[ఇద్దరు నిష్క్రమించెదరు]*

*1.2 (...కొనసాగింపు)*

**శిష్యుడు-1:** ఆహా!
**శిష్యుడు-2:** ఏమిటి గంగనా?

**శిష్యుడు-1:** భగవతంతుని తొమ్మిది రకాలైన భక్తి మార్గములలో కొలువవచ్చునట!
**శిష్యుడు-2:** ఏమిటా తొమ్మిది?

**శిష్యుడు-1:** ప్రహ్లాదుడు తన తండ్రిగారైన హిరణ్యకశిపునకు ఇట్లు చెప్పెను:

తనుహృత్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా
ర్చనముల్ సేవయు నాత్మలో నెఱుకయున్ సంకీర్తనల్ చింతనం
బను నీ తొమ్మిదిభక్తిమార్గముల సర్వాత్మున్ హరిన్ నమ్మి స
జ్జనుఁడై యుండుట భద్రమంచుఁ దలఁతున్ సత్యంబు దైత్యోత్తమా (7.167)

**శిష్యుడు-2:** ఎంత జ్ఞానోదయము గల పద్యము! మరి ఇందాక భగవంతుని పూజించే చేతులే చేతులు అని పొగిడారు కదా గురువుగారు?

**శిష్యుడు-1:** అవును!
**శిష్యుడు-2:** ఈ పద్యంలో భగవంతుని పూజించనటువంటి చేయి - అది చేయి కాదు, చెట్టుకొమ్మతో చేసిన తెడ్డు అంటారు.

**శిష్యుడు-1:** ఏదీ వినిపించు
**శిష్యుడు-2:** దీనిని ప్రహ్లాదునిచే పలికించారు పోతనగారు:

కంజాక్షునకుఁ గాని కాయంబు కాయమే పవనగుంఫిత చర్మ భస్త్రి గాక
వైకుంఠుఁ బొగడని వక్త్రంబు వక్త్రమే ఢమ ఢమ ధ్వనితోడి ఢక్క గాక
హరిపూజనము లేని హస్తంబు హస్తమే తరుశాఖ నిర్మిత దర్వి గాక
కమలేశుఁ జూడని కన్నులు కన్నులే తనుకుడ్యజాల రంధ్రములు గాక

చక్రి చింతలేని జన్మంబు జన్మమే
తరళ సలిలబుద్బుదంబు గాక
విష్ణుభక్తి లేని విబుధుండు విబుధుఁడే
పాదయుగముతోడి పశువు గాక. (7.170)

**శిష్యుడు-1:** గురువుగారు దేవాలయానికి వెళ్ళారు కదా, మనం కూడా వెళ్ళొద్దాం పద.
**శిష్యుడు-2:** సరే పద.

## 2.1 నారదుడు వ్యాసునకు భాగవతమును వ్రాయమని చెప్పుట [సరస్వతి నదీతీరము]

**వ్యాసుడు:** *[వ్యాకుల చిత్తుడై కూర్చుని యుండును]*

**నారదుడు:** *[ప్రవేశించును]*
నారాయణ! నారాయణ! వ్యాసా! ఎందుకు నీవిలా చింతించు చున్నావు?

**వ్యాసుడు:** *[నిలబడి]* ప్రణామములు గురువర్యా! మీరెరుగనిదేమి? వేదములను విభజించి మానవునికి తగిన కర్మ ధర్మములను బోధించితిని. అయినను నామనస్సెందుకో వ్యాకులత గొనియున్నది.

**నారదుడు:** వ్యాసా! ఎన్ని ధర్మములను నీవు బోధించినను, జుగుప్సితములైన కామ్య కర్మలే ధ్యేయముగా మానవులు జీవింతురు. అదిగో అటు చూడుము. కలియుగములోని మానవుల కష్టములు నీకు చక్కగా బోధపడును.

******* [ఇచ్చుట భాగము "2.2 కలియుగములోని భక్తుల సందిగ్ధము" పూర్తిగా నడచును] *******

చూచితివా వ్యాసా! కోరికలు లేకుండగా ఎవ్వరు పనిచేయుటలేదు. చివరికి దేవుని సన్నిధిలోనూ కోరికలతో అంధులగుచున్నారు. కనుక నీవు భగవంతుని లీలలను వర్ణించుచూ, కామ్యకర్మములను విడనాడే మార్గమును చూపుతూ ఒక గ్రంథమును వ్రాయుము. తెలియనివానికి కూడా అర్థమయ్యే రీతిలో ఆ గ్రంథమును వ్రాయుము.

ఎఱిఁగెడు వాఁడు కర్మచయమెల్లను మాని హరి స్వరూపమున్
నెఱయ నెఱింగి యవ్వలన నేరుపుఁ జూపు గుణా నురక్తుఁడై
తెఱకువ లేక క్రుమ్మరుచు దేహధనాద్యభిమాన యుక్తుఁడై
యెఱుఁగని వానికిం దెలియ నీశ్వరలీల లెఱుంగఁ జెప్పవే. *(1.99)*

ఇంకా వినుము. ఈ సంసారమనే సాగరములో భక్తి ఒక నావలాంటిది.

విను మీ సంసారం బను
వననిధిలో మునిఁగి కర్మవాంఛలచే వే
దనఁ బొందెడు వానికి వి
ష్ణుని గుణవర్ణనము తెప్ప సుమ్ము మునీంద్రా! *(1.131)*

**వ్యాసుడు:** మీ ఆనతి గురువర్యా! *[నమస్కరించును]*

**నారదుడు:** నారాయణ, నారాయణ! *[వెడలిపోవును]*

**వ్యాసుడు:** జీవుడు మాయచేత మోహితుడవునుకదా!

జీవుండు మాయచేత మోహితుండయి గుణవ్యతిరిక్తుండయ్యు
మాయాసంగతిం దాను ద్రిగుణాత్మకుండని యభిమానించుచు
ద్రిగుణత్వాభిమానంబునం గర్తయు భోక్తయు నను ననర్థంబు నొందు;
నయ్యనర్థంబునకు నారాయణభక్తి యోగంబు గాని యుపశమనంబు వేఱొకటిలేదు. *(1.135)*

*********** [నేరుగా భాగము 3.1 కి వెళ్ళుము] ***********

## 2.2 కలియుగములోని భక్తుల సందిగ్ధము

- *నారదుడు, వ్యాసుడు ఒక ప్రక్కగా కూర్చొనియుండుదురు.*
- *పూజారులు ఒక దేవాలయము ద్వారము దగ్గర నిలబడి భక్తులకు శఠగోపంతో ఆశీర్వదించుచుండును.*
- *రెండవ ద్వారం దగ్గర ఎవ్వరు ఉండరు.*

**భక్తులు:** ఏడుకొండలవాడా వేంకటరమణ గోవిందా గోవిందా! *[అనేక పర్యాయములు]*

**నారదుడు:** వ్యాసా చూచితివా, ఆ భక్తులను?
**వ్యాసుడు:** భక్తి సముద్రంలో మునిగినట్లున్నారు గురుదేవా!
**నారదుడు:** నారాయణ, నారాయణ. నిజమేమిటో తెలిసికొందాం. చూడుము. ఇప్పుడు నేనొక చిన్న పరీక్ష పెట్టెదను.

**పూజారులు:** ఏడుకొండలవాడా వేంకటరమణ గోవిందా గోవిందా! *[ప్రదక్షిణము చేయును]*

**పూజారి-1:** పూజారి గారు! నారదులు చెప్పిన విషయమును గ్రహించితిరా?
**పూజారి-2:** ఇప్పుడు ఒక చిన్న పరీక్ష పెట్టవలసిన సమయము ఆసన్నమయినది.

**పూజారులు:** *["కోరికలు గలవారు" అని ఒక నినాదమును దూరముగానున్న మొదటి ద్వారమునకు తగిలించెదరు. "కోరికలు లేనివారు" అని ఇంకొక నినాదమును వారికి దగ్గరగానున్న రెండవ ద్వారమునకు తగిలించెదరు.]*

**భక్తులు:** *[రెండవ ద్వారము దగ్గర]* ఏడుకొండలవాడా వేంకటరమణ గోవిందా గోవిందా! *[ప్రదక్షిణము చేయును]*

**పూజారులు:** భక్తులారా!

**పూజారి-1:** భక్తులారా! మీకొక విన్నపము. కోరికలు తీర్చుకోవాలుకున్నవారు ఆ ద్వారం గుండా వెళ్ళండి. కోరికలు వద్దనుకున్నవారు ఇదిగో ఈ ద్వారం గుండా వెళ్ళండి.

**పూజారి-2:** ఆటు వెళ్తే, మీకోరికలు తీరునేమోగానీ, మోక్షానికి మాత్రం ఎన్ని యుగాలు పట్టునో! మరి ఇంకా చాలా తొక్కిసలాట కూడానూ. ఇదిగో ఇటు చూడండి. ఈ రెండవ మార్గంగుండా వెళ్తే, మోక్షము చాలా సులభతరమవుతుంది.

**భక్తులు:** ఏడుకొండలవాడా వేంకటరమణ గోవిందా గోవిందా! *[అంటూ తోసుకొని, పూజారులను కూడా క్రిందకు త్రోసి మొదటి మార్గం ద్వారా వెళ్తారు.]*

**పూజారి-1:** *[పైకి లేస్తూ]* పూజారి గారు! ఇప్పుడు మీకోరికేమిటి?

**పూజారి-2:** ఈ భక్తులను ఆ భగవంతుడే కాపాడాలని నాకోరిక.

**పూజారి-1:** కర్మలు భవిష్యత్తును నిర్ణయించును గానీ, కోరికలతో భగవంతుని చెంతకేగిన ఈ కోరికల వలయంలో చిక్కుకొంటారేగానీ, మోక్షము కలుగునా?

**పూజారులు:** ఏడుకొండలవాడా వేంకటరమణ గోవిందా గోవిందా!

****** [తరువాతి ఘట్టము 2.1 మధ్యలో] ******

## 3.1 పరీక్షిత్తు రాజభవనం

*- మంత్రి కూర్చొని యుండును.*

*- పరీక్షిత్తు సింహాసనం మీద నుండి దిగి ఆవేశంతో అటూ ఇటూ కొద్ది క్షణాలపాటు నడిచి, మరల సింహాసనము మీద కూర్చొనును.*

**మంత్రి:** పరీక్షిన్మహరాజా! కలియుగము గురించి మీకింతటి మనో వ్యాకులము అనవసరమని నా అభిప్రాయము. మీరు మీ తాతగారైన ధర్మరాజు కంటే ఎక్కువగా దానధర్మాలను చేశారు. ఇప్పటికే మూడు అశ్వమేధ యాగాలు కూడా పూర్తిగావించారు. ఇంత ధర్మబద్ధముగా సాగుతున్న మీ పరిపాలనలో ఎటువంటి అధర్మమునకు తావు కలుగదని నేనంటాను. మరి నాకు సెలవిప్పిస్తే... *[కొద్దిగా లేవబోయి ఒక భటుని రాకతో మరల కూర్చొనును]*

**భటుడు 1:** *[అప్పుడే ప్రవేశించి]* పరీక్షిన్మహారాజుకు జయీభవ, దిగ్విజయీ భవ!

**భటుడు 1:** మహారాజా! పశ్చిమ దిశగా రాజ్యవిస్తరణ కొరకై దండయాత్రను ప్రకటించిన దిక్భూపతి, దండయాత్రను చాలించి, మీ సాన్నిహిత్యం కొఱకు దూతలను పంపనున్నారు. *[పరీక్షిత్తు తల ఊపును, భటుడు వెడలిపోవును.]*

**మంత్రి:** చూశారా! నామాటలు అక్షరాలా నిజం. శత్రువులు కూడా మీ ధర్మ పరిపాలనను గుర్తించారంటే, ఇక కలి యుగము గురించి మీకనవసరం. నిశ్చింతగా మీరు కొద్దిరోజులు విశ్రాంతి తీసుకోండి. కొంచెం ఎండలు మెండుగా ఉన్నా, మానసోల్లాసమునకు వేటకు బయలుదేరండి. నామాటలు నమ్మండి. ఇక నాకు సెలవిప్పిస్తే... *[కొద్దిగా లేవబోయి ఇంకొక భటుని రాకతో మరల కూర్చొనును.]*

**భటుడు 2:** *[అప్పుడే ప్రవేశించి]* మహారాజా! నర్తకీమణి నాట్య ప్రదర్శన చేయుటకు తమ ఆదేశము కొఱకు వేచియున్నారు. *[పరీక్షిత్తు రమ్మని చేసైగ చేయును, భటుడు వెడలిపోవును.]*

**మంత్రి:** అయ్యా! ఈ నాట్యమయ్యాక సెలవు తీసుకొంటాను, అనుమతివ్వండి.

**నర్తకి:** *[ప్రవేశించి, రాజుకు నమస్కరించి, ఒక పాటకు నాట్యము చేయును.]*

*[అనుగుణమైన కొన్ని పాటలు:*

*- "భక్త పోతన" (1947) చిత్రమునుండి పాట: మంచి సమయము రారా*

*- స్వాగతం కృష్ణ శరణాగతం కృష్ణ మధురాపురి సదనా మృదువదనా మధుసూదన ఇక* https://youtu.be/Fuc5V9ZdziU

*- మరులు కొన్నానే - బాలమురళీకృష్ణ* https://youtu.be/YngEf8DlXf4

*- మరులు మించేరా సఖా నిన్ను విడనాడలేరా (బాలమురళీకృష్ణ)* https://youtu.be/2ToRU47nq-g

*]*

**నర్తకి:** *[నాట్యము అనంతరం, రాజునకు నమస్కరించును.]*

**పరీక్షిత్తు:** *[బహుమతినిమ్మని ఒక భటుని చే సైగ చేయును]*

**భటుడు 2:** *[ప్రవేశించి ఒక పండ్ల పళ్ళెమును నర్తకికిచ్చును, నర్తకి, భటుడు వెడలిపోవును.]*

**మంత్రి:** రాజా! నాకిక సెలవిప్పించండి. మరల రేపు కలిసెదను.

**పరీక్షిత్తు:** *[సరేనని తల ఊపును, మంత్రి వెడలిపోవును.]*

## 3.2 పరీక్షిత్తు - కలి పురుషుల సంవాదము [ప్రదేశము: పరీక్షిత్తు రాజభవనము]

**పరీక్షిత్తు:** *[సింహాసనం దిగి అటూ ఇటూ తిరుగుచుండును.]*

**కలిపురుషుడు:** *[ప్రవేశించి, గోవును కొట్టుకుంటూ వచ్చుచుండును]*

**పరీక్షిత్తు:** ఆపు నీ దుర్మార్గము. భూమాతయైన ఆ గోవును, ధర్మదేవుడైన ఆ ఎద్దును ఎందుకలా చిత్రవధ చేస్తున్నావు? అసలు నీవెవరు?

**కలి పురుషుడు:** నేను కలి పురుషుడను. వీరు నాదారికి అడ్డం వచ్చారు.

**పరీక్షిత్తు:** *[కోపముతో]* ఆపు నీ ప్రేలాపన. ఇట్టి అధర్మమే నీ మార్గమైతే, నా ధర్మ మార్గమేమిటో నీకు తెలియజేస్తాను. *[పరీక్షిత్తు కత్తిని తీసి కలిపురుషుని చంపబోవును. కలిపురుషుని కర్ర క్రింద పడిపోవును.]*

**కలి పురుషుడు:** *[పరీక్షిత్తు యొక్క పాదాలమీడ వ్రాలి]* రక్షించండి మహాప్రభు, రక్షించండి. దయచేసి నన్ను చంపకండి.

**పరీక్షిత్తు:** *[కొంచెం సేపు ఆలోచించి]* సరే, ఎంత శతృవైనా శరణార్థులను చంపడం నా ధర్మము కాదు.

**కలి పురుషుడు:** *[లేచి నమస్కారము చేసి నిలబడును.]*

**పరీక్షిత్తు:** నీకు నారాజ్యంలో చోటులేదు, నీ ప్రాణాలు పోయేముందే నా రాజ్యం నుంచి వెళ్ళిపో.

**కలి పురుషుడు:** మహా ప్రభువులు. ద్వాపరయుగం ముగిసింది, శ్రీకృష్ణ పరమాత్మ నిర్యాణం చేశారు. ఇక ఇది యుగధర్మం ప్రకారం నాయుగమవుతుంది. మీరు ధర్మ ప్రభువులు. నేను శరణార్థిని. కనీసం మీకు కష్టం లేని ప్రదేశాలలో ఉండుటకైనా అనుమతివ్వండి. మీ పరిపాలనలో మద్యపానములాంటి మత్తుమందులు ఉన్నాయా?

**పరీక్షిత్తు:** *[మీసం దువ్వుకుంటూ]* లేవు.

**కలి పురుషుడు:** జూదం ఉన్నదా?

**పరీక్షిత్తు:** [మీసం దువ్వుకుంటూ] లేదు.

**కలి పురుషుడు:** ప్రాణి వధ ఉన్నదా?

**పరీక్షిత్తు:** *[మీసం దువ్వుకుంటూ]* లేదు.

**కలి పురుషుడు:** వ్యభిచారము

**పరీక్షిత్తు** [మీసం దువ్వుకుంటూ] లేదు గాక లేదు. చాలించు ఇక నీ ప్రశ్నలు. ఈ నాలుగు ఎక్కడుంటాయో, అక్కడకు నీవు పారిపోవచ్చు.

**కలి పురుషుడు:** మహారాజా! ఈ నాలుగు మీ రాజ్యంలో లెవ్వంటున్నారు. మరి నేనెలా ఉండగలను. చివరిగా ఒక్క కోరిక

**పరీక్షిత్తు:** ఏమిటది?

**కలి పురుషుడు:** కనీసం ధనము లేదా బంగారము ఉన్న చోట కొంచెం తావిస్తే.....

**పరీక్షిత్తు:** *[నిర్లక్ష్యంగా]* సరే పో.

**కలి పురుషుడు:** హమ్మయ్య! బ్రతికించారు. చాలా ధన్యవాదాలు.

**కలి పురుషుడు:** *[వెనుదిరిగి, పగలబడి నవ్వుకుంటూ]* పిచ్చిరాజు, ఆయన కిరీటంలోనే బంగారం ఉంది. ఇకనాకు చోటులేకేం? ఎంత ధర్మపరులైనా, ధనము బంగారము దగ్గరకు రాకుండునా? మరి నా మనుగడకు ఇక తిరుగులేదు. *[వెడలిపోవును.]*

***పరీక్షిత్తు:*** *[వెడలిపోవును]*.

### 3.3 పరీక్షిత్తు వేటకేగుట, శమీకునిపై చచ్చిన పామును విసరుట, శాపగ్రస్తుడగుట [ప్రదేశము: శమీకుని కుటీరము దగ్గర]

*- పరీక్షిత్తు విల్లు, బాణములను పట్టుకొని, అలసిపోయినట్లుండును, బాగా దప్పికగొనినట్లు కనిపించును. నీటికొఱకు వెతుకుచున్నట్లు కనిపించును.*

**పరీక్షిత్తు:** అరెరే! అడవికి వేటకు వచ్చి దారి తప్పితిని. నాసైన్యము కూడా కానరాదు. తీవ్రమైన దాహము. కనుచూపులో కొలనైనా కనిపించదు. ఇప్పుడు మార్గమేమిటి? అదిగో! ఏదో ఒక మునియాశ్రమము వలెనున్నది.

**పరీక్షిత్తు:** *[ముని ఆశ్రమము వద్దకు వచ్చి]* ఎవరది? - *[సమాధానము రాదు]* ఎవరు లోపల? - *[సమాధానము రాదు]* ఎవరున్నారు లోపల? *[కోపముగా]* నేను పరీక్షిత్తును. - *[సమాధానము రాదు]* *[కిరీటమును సవరించుకొనుచు]* నేను ఈరాజ్యానికి అధినేతను. - *[సమాధానము రాదు]* ఏమిటీ విడ్డూరము? నారాజ్యం లో అతిథి సత్కారములకు కూడా కరువాయెనా? అదియును గాక నేను రాజును. రారేమీ పూలమాలలతో? ఏవీ పండ్లు, ఫలములు? ఏవీ వినయవిధేయతలు? నేను పిలచినా నా ఆజ్ఞకు ధిక్కారమా? హుం... *[సమాధానము రాదు]*

**పరీక్షిత్తు:** *[తపస్సు చేసికొనుచున్న మునిని చూసి]* ఓ! నా పలుకులు వినిపించనంత దీర్ఘముగా సమాధిలోనికి వెళ్ళెనా? లేదా అలా నటించుచుండెనా? *[కాలు క్రిందకు కోపముతో తన్ని, వెనుదిరిగి పోవుచూ, ఆగి, ఒక చచ్చినపామును ముని మెడకు వ్రేళ్ళాడవేసి]* ఆహా! ఇప్పుడు నీవు సాక్షాత్తు ఆ పరమ శివునివలేనున్నావులే! *[తిరిగి, మరల కాలిని నేలపై తన్ని, కోపముతో వెడలిపోవుచూ]* ముని అట! తపస్సు చేసికొనుచుండెనట! రాజమర్యాదలు లేవట!

*- [కొంతసేపయ్యాక ముని కుమారుడైన శృంగి, అతని స్నేహితుడైన గౌరుడు వచ్చును.] -*

**గౌరుడు:** *[శమీకుని చూసి]* భలే భలే! శృంగీ, మీ తండ్రిగారు సాక్షాత్తు ఆ పరమశివునివలే ఉన్నారు.
**శృంగి:** మా తండ్రిగారేమిటి? పరమశివునివలే ఉండుట ఏమిటి?

**గౌరుడు:** *[శమీకుని చూసి]* ఔనురా శృంగీ! మెడలో ఆపాము, తపస్సులో ఉన్న ఆయన విగ్రహము, ...
**శృంగి:** గౌరా, ఏమి చెప్పావు? మెడలో పామా?

*- [శృంగి కంగారుగా తప్పసులోనున్న తన తండ్రి దగ్గరకు నడచును, గౌరుడు వెంట వెళ్ళును.] -*

**గౌరుడు:** కంగారు పడకురా! అది చచ్చిన పామువలే యున్నది.
**శృంగి:** *[కంగారుగా, ఆ పామును ఒక పొడవాటి కర్రతో, అతి కష్టముతో తొలగించుచు]* మరి ఇదే పాము ఒకవేళ బ్రతికియున్నట్లయితే?
**గౌరుడు:** ఏముందీ! ఈ పాటికి మీ తండ్రిగారి దేహము శవమై యుండును.
**శృంగి:** ఇంత పాపానికి పాలుపడినవాడు ఎవడైయుంటాడు?

**గౌరుడు:** ఏమో! ఇక్కడైతే గుర్రపు డెక్కల జాడలు స్పష్టం గా కనిపిస్తున్నాయి. మన కుటీరము వైపు నుండి రాజు గారు వెళ్ళటం నేను చూశాను. ఆయన పిలిచి ఉంటారు, మీ తండ్రిగారు సమాధిలో ఉండి పలుకకపోయుంటారు. మరి ఇది ఆయనగారి క్రుత్యమే అయి ఉంటుంది.

**శృంగి:** రాజైన మాత్రాన ఇంత పొగరా? ఇంత గర్వమా? అడవులలో ఎవరికి హాని కలిగించని, శక్తిలేని మనబోటి వారలమీదనా ఈ రాజు శక్తిని ప్రయోగించుట? రాజ్యాలను కొల్లగొట్టి పరుల సొమ్మును తనసొమ్ముగా చేసికొను వారు రాజులు, నిరుపేద బ్రతుకులతో అడవిలో జీవించు వారలము మనము.
**శృంగి:** *[కోపముతో, అటు ఇటు కొద్దిసేపు తిరిగి, తన తండ్రి గారి కమండలము ను తీసికొని, నీటిని ఒకచేతిలో పోసికొని]* ఇదే నాశాపము. ఈ అఘాయిత్యము ను చేసిన ఆ రాజు, నేటికి ఏడవదినమున ఒక పాము కాటుకు గురై చనిపోవుగాక! *[కమండలమును తండ్రిగారి దగ్గర ఉంచును.]*

### 3.4 శమీకుడు శృంగిని మందలించుట, రాజా శాపమును తెలిసికొనుట [ప్రదేశము: శమీకుని కుటీరము]

*- శమీకుడు మెల్లగా తన సమాధినుండి బయటకు వచ్చి, నిలబడి, మూడు సార్లు గుండ్రముగా తిరిగి, నలుదిక్కుల నమస్కరించి, తన కమండలమును పట్టుకొని శృంగి, గౌరుడు ఉన్న చోటుకు నడచును.*

*- శృంగి, గౌరుడు ఆయనను గమనించక సంభాషించుకొనుచుందురు.*

**గౌరుడు:** *[శృంగితో]:* అరే శృంగీ! నీవు తొందరపడినావేమోనని నా సందేహము.

**శృంగి:** తప్పు చేసిన వారిని శిక్షించవలె కదా?

**గౌరుడు:** నిజమే! కానీ మనము బాలకులం కదా, మరి పెద్దవారిని శిక్షించవచ్చా?

**శృంగి:** ఎంచక్క శిక్షించవచ్చు. చూడు, నేటికి ఏడవనాట ఆ రాజు మరణించును.

**శమీకుడు:** *[ఈ సంభాషణను విని]:* ఏమిరా! ఎవరిగురించి మీ సంభాషణ? రాజు ఎందుకు మరణించును?

**గౌరుడు:** *[నమస్కరించి]:* గురువర్యా! మీరు సమాధిలో ఉండగా, మన రాజు మీ మెడలో ఒక చచ్చిన పామును వేసి వెళ్ళెను. మరి శృంగి అది తెలిసికొని రాజు కు నేటికి ఏడవనాట మరణము సంభవించునని శపించెను.

**శమీకుడు:** *[తాత్కాలికముగా చెవులు మూసికొని, పైకి చూసి]*: పరమేశ్వరా! ఎంత తప్పిదము జరిగినది? శృంగీ! నిజా, నిజాలు ఏమిటో పూర్తిగా తెలిసికోకుండా, ఆలోచనలేక ఇటువంటి పనులు చేయవచ్చునా? అయినా నామీద వేసినది చచ్చిన పామేకదా? ఆయన ఎటువంటి బాధలో ఉన్నాడో ఏమిటో! రాజు మరణిస్తే రాజ్యం ఏమైపోవును? అధర్మము చెలరేగును. ఎంత ధర్మనిష్టతో పరీక్షిన్మహరాజు రాజ్యాన్ని పరిపాలించుచున్నాడో గ్రహించితివా? హరి హరీ! ఎంత ఘోరము జరిగినది. శృంగీ! నీ శాపమును తక్షణమే వెనుకకు తీసికొనుము నాయనా.

**శృంగి:** నన్ను క్షమించండి తండ్రీ! శాపమును వెనుకకు తీసికొను శక్తి నాకు లేదు.

**శమీకుడు:** హరి హరి! చూడు నాయనలారా! కొట్టినా తిట్టినా పరమభాగవతులు భరిస్తారే కాని, ప్రతీకారం తీర్చుకోరు. మన రాజు ఒక పరమభాగవతుడు. నీ శాపానికి ఆయన ప్రతీకారం తీర్చుకొనడు. సాధులు ఉపకారానికి పొంగిపోరు, అపకారానికి కుంగిపోరు. హరి హరి! హరి హరి!

*- [శమీకుడు హరి హరి అంటు అటు ఇటు తిరుగును. శృంగి, గౌరుడు నమస్కరించుచు ఆయన వెంట తిరుగును.] -*

**శమీకుడు:** నాయనా శృంగీ! నీవు వెంటనే పరీక్షిన్మహరాజు చెంతకేగి, జరిగిన సంగతులను తెలియజేయి.

**శృంగి:** అలాగే తండ్రీ! *[వెళ్ళబోవును]*

**శమీకుడు:** ఆగు నాయనా ఆగు! శపించిన నీవే ఈ సమాచారమును రాజుకు చేరవేయుట సమంజసముగా లేదు. నాయనా గౌరా!

**గౌరుడు:** గురువర్యా, సెలవివ్వండి!

**శమీకుడు:** చూడు నాయనా! ఈ విషయాలన్ని రాజుకు వినిపించి, శృంగి చింతించుచున్నాడని చెప్పుము. జరిగినదానికి మన్నింపు కోరు నాయనా!

**గౌరుడు:** అలాగే గురువర్యా! సెలవు. *[గౌరుడు వెడలిపోవును]*

**శమీకుడు:** *[ఈ క్రింది పోతన పద్యము పాడును]*

భూపతికి నిరపరాధము,
శాపము దా నిచ్చె బుద్ధి చాపలమున మా
పాపడు, వీడొనరించిన
పాపము దొలగింపు కృష్ణ! పరమేశ! హరీ! *(1.485)*

### 3.5 పరీక్షిత్తు శాపమును తెలిసికొని స్పందించుట, వేదపండితులను రమ్మనుట [ప్రదేశము: పరీక్షిత్తు రాజభవనము]

*- పరీక్షిత్తు సింహాసనము దిగి నిలబడి యుండును. మంత్రి నిలబడి యుండును. పరీక్షిత్తు కుమారుడు జనమేజయుడు ఆవేశముతో కనిపించును.*

*- గౌరుడు నమస్కరించుచు ఒక మూలగా యుండి, నేలవైపు చూచును.*

**జనమేజయుడు:** ఏరా మునిబాలకా! మారాజ్యంలోనే ఉంటూ, రాజుగారినే శపించెదరా? ఎంత అహంకారము? తండ్రీ, ఆజ్ఞాపించండి, ఇప్పుడే వెళ్ళి ఆ మునిబాలకుని తల వేయి ముక్కలు జేసి, మీముందుంచెదను. నేనీ కోపమును తాళలేను. ఆజ్ఞాపించండి తండ్రీ! ఆజ్ఞాపించండి. ప్రజలకు పాలకులపై గౌరవమర్యాదలు లేకున్న దేశమేగతిపాలవును?

- *[కొద్ది క్షణాలపాటు నిశ్శబ్దము, రాజు ఏమీ మాట్లాడకుండును.]* -

**జనమేజయుడు:** మంత్రివర్యా! మీరైనా రాజుగారికి నచ్చచెప్పండి. ఆయన ఆజ్ఞను శిరసా వహించడానికి సిద్ధంగా ఉన్నాను.

**మంత్రి:** రాజా, మీరేమీ పలుకరు. మౌనమే అంగీకారమా?

**పరీక్షిత్తు:** లేదు మంత్రీ! లేదు. జనమేజయ! వేగిరపడకు. ఒకతప్పును వేరొక తప్పుతో సరిచేయగలమా? ఎంత చిన్న తప్పిదమైనా, నేను చేసినది నేరమే! కష్టాలలో ఉన్నపుడే మనిషి నిజస్వరూపము బయటపడును. ఇన్ని సంవత్సరాలు ధర్మబద్ధముగా పాలించుచున్ననూ, రాజుననే అహంకారము నాలో ఇంకా చావలేదు. మా తాతగారైన ధర్మరాజు చెప్పిన ఒక ముంగిస కథ గుర్తులేదా?

- *[కొద్ది సేపు అంతా నిశ్శబ్దము]* -

**పరీక్షిత్తు:** జనమేజయ! నేడే నీ పట్టాభిషేకమునకు తయారుకమ్ము. భటులారా! జనమేజయుని పట్టాభిషేకానికి పురోహితులను, బలములను తయారుచెయ్యండి. *[కొంచెం ముందుకు నడచును, మంత్రివైపు తిరుగును]*.

**పరీక్షిత్తు:** మంత్రీ! నాకాలము దగ్గరైనది. ఒక మనిషి కి ఏడు రోజులలో మరణము సంభవించునని తెలిసినపుడు, చేయవలసిన కర్తవ్యమేమిటి?

**మంత్రి:** *[కొద్దిసేపాగి]* రాజా, ఆజ్ఞాపించండి, మన రాజ్యంలోని వేద విభులను, పండితులనందరిని కొనితెచ్చెదము. వారు మీ మనోవ్యాకులమును తప్పక నివారింపగలరు.

**పరీక్షిత్తు:** సరే, అలాగే చేయండి, మీరాపనిలో ఉండండి.

**మంత్రి:** సెలవు *[వెడలిపోవును]*.

**పరీక్షిత్తు:** మునిబాలకా! నీవిక వెళ్ళవచ్చు. ఒక మనిషిగా నాకర్తవ్యమును తెలిసికొనుటకు ఇదే నాకు కలిగిన వరముగా భావించెదను. *[మునిబాలకుడు వెడలిపోవును.]*

**జనమేజయుడు:** తండ్రీ, ఏమిటీ ఘోరము? ఒంటి కాలి స్థంభముతో ఒక గదిని కట్టించెదమా? మీ ఆయుస్సు కోసం ఆయుష్టోమం చేయిస్తాను. సర్పములనన్నింటిని నేను హతమార్చగలను.

**పరీక్షిత్తు:** జనమేజయ! ప్రతి మనిషికి మరణము తథ్యము. నేను అదృష్టవంతుడను ఎందుకంటే నేను ఎన్ని రోజులు జీవించెదనో నాకు నిశ్చితంగా తెలిసినది, ఇక నా కర్తవ్యాన్ని తెలుసుకొనవలెను. వెళ్ళు, వెళ్ళి నీ పట్టాభిషేకానికి తయారుగా.

## 3.6 శుకుడు పరీక్షిత్తునకు ముక్తిమార్గము తెలుపుట [ప్రదేశము: వనప్రాంతము, యజ్ఞ వాటిక]

- *పరీక్షిత్తు (కిరీటము లేకుండ, సామాన్య వస్త్రములతో) మధ్యలో నిలబడును.*
- *మంత్రి, జనమేజయుడు (కిరీటము ధరించి, రాజ వస్త్రములు ధరించి), నర్తకి, భటులు ఒకవైపు నిలబడి యుండును.*
- *కొందరు పండితులు, ముని బాలకులు, మునులు, శమీకుడు వేరొకవైపు కూర్చొని యుండును.*

**మంత్రి:** రాజా, మీ ఆజ్ఞానుసారము ఇదిగో మనరాజ్యములోని వేదపండితులనందరిని పిలిపించాను.

**పరీక్షిత్తు:** *[నమస్కరించుచు]* వేదవిభులారా! ఏడు దినములలో నాకు మరణము సంభవించనుంది. వేదగీతాలనన్నింటిని బాగా పరిశీలించండి, నాకు ముక్తిమార్గమును ఉపదేశించండి.

**పరీక్షిత్తు:** *[నమస్కరించుచు]* అమ్మా, గంగమ్మ తల్లీ! నిన్ను దర్శించినవారికి మోక్షమును ప్రసాదిస్తావని విన్నాను. కరుణించవమ్మా!

**ఒక ముని:** రాజా! వ్యాస భగవానుని కుమారుడు, పదహారేళ్ళ బాలుడు, నక్షత్రాల సమూహములో పూర్ణ చంద్రుడిగా వెలుగునొందుచున్న శుక యోగీంద్రులు, అదిగో, మీ అదృష్ట వశాత్తు ఇటే వచ్చుచున్నారు. మీకు ఉపదేశించుటకు ఆయనకంటే తగినవారు ఇంకెవ్వరు లేరు.

- *[శుకుడు అటుగా వచ్చుచుండును]* -
- *[పరీక్షిత్తు శుకుని పాదాలమీద పడి నమస్కరించును]* -

**జనమేజయుడు**: *[ఈ క్రింది పోతన పద్యమును పాడును.]*

ఉండు మనరాదు గురుడవు యోగివిభుఁడ
వావుఁ బిదికిన తడవెంత యంత సేపు
గాని యొక దెస నుండవు కరుణతోడఁ
జెప్పనే తండ్రి ముక్తికిఁ జేరు తెరువు. *(1.525)*

**మంత్రి:** *[ఈ క్రింది పోతన పద్యమును పాడును.]*
హరిచేతను దనుజేంద్రులు
ధరఁ ద్రుంగెడు భంగి నీ పదస్పర్శముచే
గురుపాతక సంఘంబులు
పొరిమాలుఁ గదయ్య యోగిభూషణ వింటే. *(1.523)*

**శమీకుడు/మునిబాలకులు:** [ఈ క్రింది పోతన పద్యమును పాడును]
ఫాలము నేల మోపి, భయభక్తులతోడ నమస్కరించి, భూ
పాల కులోత్తముండు గరపద్మములన్ ముకుళించి, నేడు నా
పాలిటిభాగ్య మెట్టిదియొ, పావనమూర్తివి పుణ్యకీర్తి వీ
వేళకు నీవు వచ్చితి వివేకభూషణ! దివ్య భాషణా! *(1.521)*

**పరీక్షిత్తు:** *[లేచి నిలబడి]* గురుడవు, యోగివిభుడవు. నేడో, రేపో దేహాన్ని విడిచేనాకు ముక్తిమార్గమును తెలుపుము. ఏమి జపించిన, ఏమి తలంచిన, ఏమి చేసిన, ఏమి గావించిన, ఎన్నడు ముక్తి కలుగును?

**శుకుడు:** రాజా! నీవు భాగవతుడవు. మరణము సిద్ధమని తెలిసిన వారు వేలాది ప్రశ్నలు అడిగెదరు, కాని నీవిటువంటి ప్రశ్న అడుగుట నిజముగా వరము.

- *[అందరు కూర్చొనియుందురు]* -

**శుకుడు:** అన్నిభూతములలో భగవానుడు గలడు, భగవంతుడు లేని పదార్థము ఈ సృష్టిలో ఒక్క అణువు కూడా లేదు. నేల, నింగి, నీరు, నిప్పు, గాలి - వీటన్నిటా భగవంతుడైన ఆ హరి గలడు. నిజానికి ఆయన నిర్గుణ స్వరూపుడు. సంసారంలో ప్రవేశించిన వారికి తపస్సు, యోగము అను పెక్కు మార్గములు గలవు. కాని, భక్తి మార్గముకంటె సులభము వేరొకటి లేదు.

**శుకుడు:** *[ఈ క్రింది పోతన పద్యమును పాడును.]*

అరసి నిర్గుణ బ్రహ్మంబు నాశ్రయించి,
విధినిషేధ నివృత్తి సద్విమలమతులు
సేయుచుందురు హరి గుణచింతనములు
మానసంబుల నేప్రొద్దు మానవేంద్ర! *(2.6)*

**భటుడు-1:** *[నిలబడి, ఈ క్రింది పోతన పద్యమును పాడును]*

సుతుల హితుల విడిచి, చుట్టాల విడిచి
యిల్లాలి విడిచి, బహుబలాళి విడిచి
రాజు హృదయ మిడియె రాజీవనయనుపై
ధనము విడిచి, జడ్డు దనము విడిచి. *(2.53)*

**భటుడు-2:** *[నిలబడి, ఈ క్రింది పోతన పద్యమును పాడును]*

హరిమయము విశ్వమంతయు
హరి విశ్వమయుండు, సంశయము పనిలే దా
హరి హరిమయము గాని ద్రవ్యము
పరమాణువు లేదు వంశపావన వింటే. *(2.17)*

**నర్తకి:** *[నిలబడి, ఈ క్రింది పోతన పద్యమును పాడును]*
కావున సర్వాత్మకుడు మ
హావిభవుడు విష్ణు డీశు డాకర్ణింపన్
సేవింపను వర్ణింపను
భావింపను భావ్యు డభవభాజికి నధిపా. *(2.4)*

- *[అందరు లేచి నిలబడును]* -

**పరీక్షిత్తు:** *[నిలబడి, ఈ క్రింది పోతన పద్యమును పాడును]*

సర్వాత్ము వాసుదేవుని
సర్వజ్ఞుడ వైన నీవు సంస్తుతి సేయన్
సర్వభ్రాంతులు వదలె మ
హోర్వీసురవర్య! మానసోత్సవమగుచున్. *(2.55)*

- *[అందరూ కలిసి ఈ క్రింది భజన పాడెదరు]* -

హరె కృష్ణ హరె కృష్ణ కృష్ణ కృష్ణ హరె హరె
హరె రామ హరె రామ రామ రామ హరె హరె